


20న మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి-శృంగవరపుకోట

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 20న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ సిహెచ్.కేశవరావు ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి నుంచి పిజి వరకు విద్యనభ్యశించి, 18 నుంచి 35 ఏళ్ల అభ్యర్థులు అర్హులని చెప్పారు. జాబ్‌మేళాకు కాన్సెంట్ ట్రిక్స్, హెట్రో ల్యాబ్స్, కియా మోటర్స్, టాటా ఎలక్ట్రానిక్స్, ఎక్సిగా సాఫ్ట్వేర్ సొల్యూషన్స్, ఎటిసి టైర్స్, డెక్కన్ ఫైన్ కెమికల్స్, అపోలో ఫార్మసీ, మహీంద్రా అండ్ మహీంద్రా, ఎల్ అండ్ టి కనస్ట్రక్షన్స్, ప్రీమియర్, తదితర కంపెనీలు హాజరవుతాయని తెలిపారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతి, యువకులు తమ వివరాలను https://naipunyam.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని కోరారు. రిఫరెన్స్ నెంబర్, బయోడేటా, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు ఒరిజినల్, జిరాక్స్, పాస్‌ఫొటోతో జాబ్‌మేళాకు హాజరుకావాలని సూచించారు. వివరాలుకు 7995691295 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

రైతన్న రోదన

- యూరియా ఇవ్వకపోతే చంపేయండంటూ ఆవేదన
- ఎరువు కోసం సచివాలయం వద్ద రైతుల ఆందోళన

యూరియా కోసం రైతు కన్నీరు పెడుతున్నాడు. రోజుల తరబడి రైతు సేవా కేంద్రాలు, పిఎసిఎస్‌ల చుట్టూ తిరుగుతున్నా ఎరువు అందకపోవడంతో తీవ్ర ఆవేదన చెందుతున్నాడు. ఈనేపథ్యంలోనే కడుపుమండిన రైతన్న యూరియా ఇవ్వకపోతే వరిచేల దుబ్బును చంపేసినట్లు తమను కూడా చంపేయండి అంటూ వరి దుబ్బులు పట్టుకొని గురువారం దత్తిరాజేరు మండలం పరిధిలోగల పెద్దకాద గ్రామ రైతులు యూరియా కోసం సచివాలయం వద్ద ఆందోళనకు దిగారు.



ఎండిపోతున్న వరిదుబ్బులను చూపిస్తున్న రైతులు

ప్రజాశక్తి-దత్తిరాజేరు

మండలంలో రైతులు యూరియా కోసం రోజుల తరబడి రైతు సేవా కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మండుటెండలో వేచి ఉన్నా ఎరువు దొరక్కపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈనేపథ్యంలో పెదకాద, మజ్జిపేట గ్రామాలకు చెందిన రైతులు సచివాలయం వద్ద వరి దుబ్బులు, పురుగుమందు డబ్బాలు పట్టుకొని ఆందోళనకు దిగారు. ఎరువులు ఇవ్వకపోతే ఇక్కడే ఆత్మహత్య చేసుకుంటామని, ఎరువు ఇవ్వకుండా వరి దుబ్బును చంపేసినట్లు తమను కూపడా చంపేయండి అంటూ అధికారులను నిలదీశారు. రైతుసేవా కేంద్రానికి రెండు దఫాలు యూరియా వచ్చినా తమకు ఒక్క యూరియా బస్తా కూడా ఇవ్వలేదని ఆవేదన చెందారు. గురువారం రైతు సేవా కేంద్రానికి 267 యూరియా బస్తాలు రైతు సేవాకేంద్రానికి వచ్చాయి. అయితే కోడ్ రాలేదంటూ వ్యవసాయాధికారి విస్తరణ అధికారి లావణ్య యూరియా పంపిణీ చేయలేదు. అప్పటికే వేచి ఉన్న రైతులు అధికారులను నిలదీశారు. రైతుల కడుపు మంట అధికారులకు తెలియదా అని కన్నీరు పెట్టుకున్నారు. మరి కొంతమంది రైతులు భూమి పాస్ పుస్తకాలు, ఆధార్ కార్డులు తీసుకువచ్చి అధికారుల ముందు పెట్టి యూరియా పంచాలని డిమాండ్ చేశారు. నాట్లువేసి 15 రోజుల దాటినా ఇంతవరకు యూరియా వేయకపోతే ఎలా దుబ్బు కట్టి పంట పడుతుందని ఆవేదన చెందారు. నీరు పుష్కలంగా ఉన్నా ఎరువు వేయకపోతే పంటలు పండవని, కరువు వచ్చి ఆకలితో చావడం తప్ప తమకు మరోదారిలేదని అన్నారు. విషయం తెలుసుకున్న పెదమానాపురం ఎస్ఐ జయంతి సిబ్బందితో అక్కడికి చేరుకొని రైతులకు నచ్చజెప్పారు. శనివారం యూరియా పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పడంతో రైతులు అక్కడి నుంచి వెనుదిరిగారు. ఈ విషయమై వ్యవసాయశాఖ సిబ్బందిని వివరణ కోరగా రైతు సేవా కేంద్రానికి 267 యూరియా బస్తాలు వచ్చాయని, క్యూఆర్ కోడ్ రాకపోవడంతో పంపిణీ చేయలేకపోయామని, వచ్చిన తర్వాత రైతులకు పంపిణీ చేస్తామని తెలిపారు.



సంతకవిటిలో బారులు తీరిన రైతులు

అన్నదాతలకు యూరియా కష్టాలు

సంతకవిటి : మండల కేంద్రంలోని ప్రైవేట్ ఎరువుల దుకాణం వద్ద అన్నదాతలు భారీగా బారులు తీరారు. గురువారం తెల్లవారు జాము నుండి రైతులు క్యూలో ఎండల్లో నిలబడి ఉన్నా యూరియా అందకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే ప్రైవేట్ దుకాణానికి 20 మెట్రిక్ టన్నులు యూరియా రావడంతో రైతులు ఒక్కసారిగా బారులు తీయడంతో ఉద్రిక్తత వాతావరణం చోటు చేసుకుంది. దీంతో ఎస్ఐ ఆర్.గోపాలరావు పోలీస్ సిబ్బంది రైతులను అదుపుచేసి మండల వ్యవసాయ అధికారి సి.బి యశ్వంత్ రావు సమక్షంలో రైతులకు టోకెన్ ఇచ్చి, ఒక్కొక్క రైతుకు ఒక బస్తాను పంపిణీ చేశారు. ఇప్పటి వరకు మండలంలోని 722.23 మెట్రిక్ టన్నుల యూరియా రైతు సేవా కేంద్రం ద్వారా పంపిణీ చేశారు. అయినా మండలంలోని కొంతమంది రైతులకు యూరియా అందకపోవడంతో ప్రభుత్వంపై మండిపడుతున్నారు.

మండుటెండలో పాట్లు

నెల్లిమర్ల : మండుటెండలో యూరియా కోసం రైతులు పాట్లు పడ్డారు. గురువారం వల్లూరు పంచాయతీ పరిధి వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ కేంద్రం వద్ద యూరియా కోసం మండుటెండను సైతం లెక్క చేయకుండా వల్లూరు, మాల్యాడ గ్రామాలకు చెందిన రైతులు నానా తంటాలు పడ్డారు. ఒక పక్క సూర్యుడి ప్రతాపం చూపిస్తున్నప్పటికి మంచి నీరు తాగకుండా యూరియా ఎప్పుడు దొరుకుతుందా అని రైతులు ఎదురు చూసారు. వల్లూరు, మాల్యాడ గ్రామాలకు చెందిన 450మంది రైతులుంటే కేవలం 250బస్తాలు రావడంతో రైతులు అసహనం వ్యక్తం చేశారు. విత్తనాలు నాటడం నుంచి ఉబాలు వేయడం ఎరువుల కోసం పాట్లు అలవాటుగా మారిపోయిందని రైతు కష్టాలను ప్రభుత్వం ఎప్పుడు తీరుస్తుందోనని రైతులు నిరాశతో వెనుదిరిగారు.



మండుటెండలో పాట్లు పడుతున్న రైతులు

నకిలీ.. మకిలీ

- 90 ఎకరాల్లో వరి పంటకు నష్టం
- ఆవేదన చెందుతున్న అన్నదాతలు



పొల్లు వచ్చిన వరిచేను

ప్రజాశక్తి- రాజాం

నకిలీ విత్తనాలతో అన్నదాతలు మోసపోయారు. దీంతో నకిలీ విత్తనాలు ఇచ్చిన వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని గడ్డిముడిదాం గ్రామంలో రామ్ నారాయణ ప్రైవేట్ ఏజెన్సీలో రైతన్నలు విత్తనాలు కొనుగోలు చేశారు. ఆయన రైతులకు నకిలీ విత్తనాల ఇవ్వడం వల్ల సుమారు 90 ఎకరాలు నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నష్ట పోయిన రైతులు రామ్ నారాయణ ఏజెన్సీ యజమానిని ప్రశ్నించగా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆవేదన చెందుతున్నారు.

సాధారణంగా వరి పంట కాలం 125 నుంచి 140 రోజులు. అయితే కంకి 90 రోజులు తర్వాత బయటకు రావాలి. కానీ నకిలీ విత్తనాలు వల్ల కొన్ని 70 రోజుల నుంచే కంకి పెడుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పూర్తి స్థాయిలో పెరగకముందే కంకి పెట్టడంతో, ఆ ప్రభావం పంట దిగుబడి మీద పడుతుందని దీంతో సగం పంట కూడా చేతికి రాదని రైతులు వాపోతున్నారు. ఒక్కో ఎకరానికి ఇప్పటికే 20వేలు నుండి 40వేలుకు పైగా పెట్టుబడి పెట్టామని, పంట కాలం పూర్తి కాకముందే కంకి బయటకు రావడంతో తీవ్రంగా నష్టపోతామని చెబుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి నకిలీ విత్తనాలు విక్రయించిన రామ్‌నారాయణ ఏజెన్సీ యజమానిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు. క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారులు కల్తీ విత్తనాలు విక్రయించే వారిపై నిఘా పెంచితే మోసపోయే ప్రమాదం ఉండదని అన్నదాతలు చెబుతున్నారు.



వరిచేను పరిశీలిస్తున్న ఎపి రైతుసంఘం నాయకులు


గంగోత్రి సీడ్ విత్తనాలతో మోసం



సమీప రామ్‌నారాయణ ఏజెన్సీ డీలర్ వద్ద స్వల్పకాలిక 1001 విత్తనాలు అడగాను. ఆయన దానికి బదులు గంగోత్రి సీడ్ విత్తనాలను ఇచ్చాడు. నాట్లు వేసి 140 రోజులు అయితే తప్ప పంట చేతికి అందని పరిస్థితిల్లో ఈ నకిలీ విత్తనాలు వల్ల 90 రోజులకే కంకి బయటకి రావడంతో ఇటీవల కురిసిన వానకు 6 ఎకరాల్లో వరి నేలరాలి పోయింది. నాకు పెట్టుబడి కూడా రాదు. ప్రభుత్వం తగు చర్యలు తీసుకొని నష్టపరిహారం ఇప్పించి ఆదుకోవాలి.

- గౌరునాయుడు, గ్రామ రైతు

90 ఎకరాల్లో పంట నష్టం



మా గ్రామంలో సాగుకోసం 90 ఎకరాలు వరి పంట వేశాం. దీనికి కోసం రైతులు లక్షల్లో పెట్టుబడి పెట్టారు. నకిలీ విత్తనాలు వల్ల పంట చేతికి వచ్చే పరిస్థితి లేదు. రైతన్నలు సమస్యను వ్యవసాయ శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. రైతులకు న్యాయం జరగకపోతే ఆందోళన చేస్తాం.

- జి. వెంకటరమణ, టిడిపి నాయకులు, గడ్డిముడిదాం

పంట దిగుబడి తగ్గే ప్రమాదం ఉంది



నకిలీ విత్తనాలు వల్ల వరి పొలం ముందుగానే ఈనుతోంది. దీంతో పంట దిగుబడి వచ్చే పరిస్థితి లేదు. నాణ్యమైన విత్తనాలు ఇవ్వకపోవడంతో పంట నష్టం ఏర్పడింది. పూర్తిస్థాయిలో పెరగకముందే కంకి పెట్టడంతో దిగుబడిపై ప్రభావం పడుతోంది. ఈ ఏరియా పొలానికి సరికాని విత్తనాలు ఇచ్చినందుకు ఏజెన్సీపై కఠిన చర్యలు తీసుకోవాలి. పంటకు నష్టపరిహారం కూడా ఇవ్వాలి.

- బుద్ధరాజు రాంబాబు, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి

జిల్లాలో యూరియా కొరత లేదు : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలో యూరియా కొరత లేదని కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. సోషల్ మీడియాలో కొంతమంది రైతులను తప్పుదారి పట్టించే విధంగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. గజపతినగరం తదితర ప్రాంతాలలో రైతులకు అవసరమైన విధంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సరిపడా ఎరువులు, విత్తనాలు సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. జిల్లా కేంద్రంతోపాటు ప్రతి మండలంలో వ్యవసాయ అధికారి పర్యవేక్షణలో రైతులకు అవసరమైన సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. కొంతమంది వ్యక్తులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని గుర్తించామని, అటువంటి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రస్తుతం సాగు చేసిన విస్తీర్ణం మేరకు యూరియాను ఇప్పటివరకు 30,395 మెట్రిక్ టన్నులు, డిఎపి 11,426 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 9379 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. రాబోయే వారం రోజుల్లో జిల్లాకు1000 నుండి 1500 మెట్రిక్ టన్నుల యూరియా వివిధ కంపెనీల ద్వారా సరఫరా కానుందని చెప్పారు.

బిజెపి ఓట్ల చోరీకి ఇసి సహకారం

సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బంగార్రావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

బిజెపి ఓట్ల చోరీకి ఎన్నికల కమిషన్ అన్ని విధాలుగా సహకరిస్తోందని సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బుగత బంగార్రావు దుయ్యబట్టారు. స్థానిక సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బెహరా శంకరరావు అధ్యక్షతన గురువారం నిర్వహించిన జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాహుల్ గాంధీ వేసిన ప్రశ్నలకు ఎన్నికల సంఘం సమాధానం చెప్పలేని స్థితిలో ఉందన్నారు. బిజెపి ఓట్లు దోచుకోవడంలో ఇంత కన్నా నిదర్శనం ఏముంటుందని ప్రశ్నించారు. రాష్ట్రంలో గతంలో వైసిపి, ఇప్పుడు టిడిపి కూటమి ఓట్ల చోరీకి పాల్పడ్డాయని చెప్పారు. అందుకే అధికార, ప్రతిపక్షాలు కూడా మాట్లాడటం లేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకుండా ప్రజా సమస్యలు గాలికి వదిలి, తమ ప్రయోజనాల కోసం రాష్ట్రంలో కులాలు, మతాల మధ్య వైరుధ్యాలు రాజేస్తున్నాయని చెప్పారు. రోజురోజుకూ అసమానతలు పెరిగిపోతున్నాయని, వీటికి వ్యతిరేకంగా పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు.

డిసెంబర్ 6, 7 తేదీలలో జరిగే పార్టీ 9వ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు బొడ్డు వాసుదేవరావు, ఎఐసిసిటియు రాష్ట్ర సహాయ కార్యదర్శి అప్పలరాజు, ఎఐఎస్ఎ రాష్ట్ర అధ్యక్షులు కె.గౌతమి, బి.గిరిప్రసాద్, జి.సత్యారావు, ఎం.పైడి రాజు, డి.సన్యాసిరావు, ఎస్.కనకారావు పాల్గొన్నారు.

డిఎస్‌పి శ్రీనివాసరావు బదిలీ

ప్రజాశక్తి-కంటోన్మెంట్

విజయనగరం డిఎస్‌పి ఎం.శ్రీనివాసరావుపై బదిలీ వేటు పడింది. శుక్రవారం డిజిపి కార్యాలయంలో రిపోర్టు కావాలని ఆదేశాలు జారీ అయ్యాయి. శ్రీనివాసరావుపై వచ్చిన పలు అవినీతి ఆరోపణలు, ఫిర్యాదులు మేరకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నట్లు సమాచారం. ఇంటెలిజెన్స్, పోలీస్ ఉన్నతాధికారులు విచారణ చేపట్టినట్లు తెలిసింది. వారి ఇచ్చే నివేదిక ఆధారంగా శ్రీనివాసరావుపై పోలీస్ ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇన్‌ఛార్జి డిఎస్‌పిగా మహిళా పోలీసు స్టేషన్ డిఎస్‌పి ఆర్.గోవిందరావుకు బాధ్యతలు అప్పగించారు.

పండగ శోభ ప్రతిబింబించాలి

- శాఖల మధ్య సమన్వయం అవసరం
- సాధారణ భక్తులకు ఇబ్బంది కలగకుండా విఐపి దర్శనాలు : కలెక్టర్
- పండగ ఏర్పాట్లపై సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ రామసుందర్‌రెడ్డి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

పైడితల్లి అమ్మవారి ఉత్సవాలు ప్రతి ఒక్కరి మదిలో నిలిచిపోయేలా నిర్వహించాలని, పండగ శోభ ప్రతిబింబించాలని జిల్లా కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి తెలిపారు. ప్రతి దశలోనూ అధికారుల మధ్య సమన్వయం చేసుకుంటూ ఉత్సవాలను విజయవంతం చేయాలని తెలిపారు. పండగ ఏర్పాట్లపై కలెక్టర్ గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరం లో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ శాఖలు వారికీ కేటాయించిన విధులను నిబద్ధత తో నిర్వర్తించాలన్నారు. విఐపి దర్శనాల వలన సాధారణ భక్తుల దర్శనాలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. సిరిమాను తిరిగే ప్రదేశం లో ఎక్కడా రోడ్డు పై గుంతలు లేకుండా చూడాలని, అలాగే పారిశుధ్యం, రక్షిత తాగు నీటి సరఫరా , బయో టాయిలెట్స్ ఏర్పాటు , నగరమంతా సుందరీకరణ , విద్యుత్ అలంకరణ తదితర పనులను మున్సిపల్ శాఖ నిర్వహించాలని సూచించారు. వైద్య ఆరోగ్యశాఖ ద్వారా మెడికల్ క్యాంపు ను ఏర్పాటు చేసి, అత్యవసర చికిత్సకు అవసరమగు మందులను ఏర్పాటు చేయాలని తెలిపారు. 6,7 తేదీల్లో తొలేల్లు, సిరిమాను ఉత్సవం సందర్భంగా ఎక్కువ మంది భక్తులు వస్తారని, శాంతి భద్రతలకు లోటు లేకుండా చూడాలని పోలీస్ శాఖ వారికీ సూచించారు. బారికాడింగ్ ఎత్తు పెంచాలని, లేదంటే పై నుండి దూకి వస్తున్నారని పోలీస్ వారు చేసిన విజ్ఞప్తి మేరకు కలెక్టర్ 4 అడుగుల నుండి 5 అడుగులకు పెంచాలని ఆర్అండ్‌బి అధికారులకు సూచించారు. తెప్పోత్సవంలో గజ ఈతగాళ్ళు ఉండాలని, మత్స్య వారికీ , తెప్పలను తనిఖీ చేసి సర్టిఫికేట్ ఇవ్వాలని ఆర్ అండ్ బి వారికీ సూచించారు.

సంయుక్త కలెక్టర్ సేతు మాధవన్ మాట్లాడుతూ అక్టోబర్ 1 నుండి 7వరకు నగరమంతా సుందరీకరణ చేయాలని ఎంఎస్ఎంఇ శాఖా మంత్రి సూచించినట్లు తెలిపారు. సమావేశంలో అదనపు ఎస్.పి సౌమ్య లత , డిఆర్ఒ శ్రీనివాస మూర్తి, ఆర్‌డిఒ కీర్తి, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శిరీష , పూజారి బంటుపల్లి వెంకట రావు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

21న అండర్- 14 క్రికెట్ జట్టు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 21న అండర్-14 బాలుర జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహిస్తామని జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి పి.సీతారామరాజు (రాంబాబు) ఒక ప్రకటనలో తెలిపారు. విజ్జి స్టేడియంలో ఆదివారం ఉదయం 7 గంటలకు ఎంపికలు నిర్వహిస్తామని అన్నారు. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు 2011 సెప్టెంబర్ 1 తర్వాత జన్మించిన వారై ఉండాలని అన్నారు. క్రీడాకారులు వారి సొంత క్రికెట్ కిట్టు, ఒరిజినల్ జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, మూడేళ్ల స్టడీ సర్టిఫికెట్స్ తీసుకు రావాలని, తెలుపు దుస్తులు ధరించి రావాలని తెలిపారు.

పోక్సో కేసులో విఆర్ఎ అరెస్టు

ప్రజాశక్తి-బొబ్బిలి

బాలికను లైంగికంగా వేధించిన కేసులో బొబ్బిలి మండలం గోపాలరాయుడు పేటకు చెందిన విఆర్ఎను డిఎస్‌పి భవ్యరెడ్డి అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. గోపాలరాయుడుపేటకు చెందిన బాలికను విఆర్ఎ మాయమాటలు చెప్పి బయటకు తీసుకుపోవడంతో తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసు స్టేషన్లో మే 3న మిస్సింగ్ కేసు నమోదైంది. అప్పటి నుంచి బాలికను విఆర్ఎ వివిధ ప్రాంతాలకు తీసుకుని వెళ్లి లైంగిక దాడి చేయడంతో నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు సిఐ సతీష్ కుమార్ చెప్పారు.

జ్యూట్‌మిల్లు భూములపై కూటమి కన్ను

భూఆక్రమణను అడ్డుకోవాలి : మాజీ ఎమ్మెల్యే శంబంగి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

ప్రజాశక్తి-బొబ్బిలి

మహవీర్ జ్యూట్‌మిల్లు భూములపై కూటమి నాయకుల కన్ను పడిందని, ఈ ఆక్రమణను అడ్డుకోవాలని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు అధికారులను కోరారు. స్థానిక వైసిపి కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ బాడంగి మండలం డొంకినవలస ఎత్తు బ్రిడ్జి వద్ద మహవీర్ జ్యూట్ మిల్లు యాజమాన్యం... జ్యూట్ మిల్లు ఏర్పాటు చేసి రైతుల కుటుంబాలకు ఉద్యోగాలు ఇస్తామని చెప్పి తక్కువ ధరకు భూమిని సేకరించిందన్నారు. జ్యూట్ మిల్లు ఏర్పాటు చేయకపోవడంతో రైతు కుటుంబాలు ఆర్థికంగా నష్టపోయాయన్నారు. మిల్లు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు భూమిని సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నారని, ఆయా భూములకు నకిలీ పత్రాలతో ఆక్రమించేందుకు కూటమి నాయకులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అందుకోసం రెవెన్యూ అధికారులతో కుమ్మక్కయ్యారని చెప్పారు. భూమిని మహవీర్ యాజమాన్యానికి ఇవ్వాలని, లేదంటే రైతులకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కూటమి నాయకుల ఒత్తిడికి రెవెన్యూ అధికారులు తలొగ్గితే ఉద్యోగాలు పోవడం ఖాయమని హెచ్చరించారు.

ప్రజాశక్తి కథనంతో ఆగిన ఆక్రమణ

గతంలో జ్యూట్‌మిల్లు భూములను నకిలీ పత్రాలతో ఆక్రమణ చేసేందుకు ప్రయత్నిస్తే 'ప్రజాశక్తి'లో కథనం రావడంతో ఆక్రమణ ఆగిందని శంబంగి గుర్తుచేశారు. అప్పటి తహశీల్దార్ ఆదిలక్ష్మిపై ఒత్తిడి చేస్తే మ్యుటేషన్ తిరస్కరించాలని ఎమ్మెల్యేగా తాను ఆదేశించినట్లు చెప్పారు. ఎనిమిది సార్లు తిరస్కరించిన మ్యుటేషన్ ఇప్పుడు ఎలా ఆమోదిస్తారని ప్రశ్నించారు. సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, వైసిపి నాయకులు ఆవు సత్యనారాయణ, బి.శంకరరావు, జి.శంకర్, ఎం.వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

వితంతు పింఛన్లు మంజూరు చేయండి

ప్రజాశక్తి-విజయనగరం కోట



అసెంబ్లీలో మాట్లాడుతున్న అదితి

2019 ఏప్రిల్1వ తేదీకి ముందు భర్త చనిపోయిన వితంతువులకు నేటివరకు పింఛన్లు మంజూరు కాలేదని, వారికి మంజూరుచేయాలని ఎమ్మెల్యే పి.అదితి గజపతి రాజు కోరారు. గురువారం అసెంబ్లీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ పింఛన్లు మంజూరు కాకపోవడంతో పేద మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వితంతు మహిళలు పింఛన్ల కోసం సమస్యను లేవనెత్తిన అంశాలపై సభా సభ్యులు హర్షం వ్యక్తంచేశారు.

నానో యూరియాపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి-బొబ్బిలి



అసెంబ్లీలో మాట్లాడుతున్న బేబినాయన

యూరియా కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, నానో యూరియా, నానో డిఎపి వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే బేబినాయన కోరారు. గురువారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ఒక యూరియా బస్తా ఎంత పని చేస్తుందో.. నానో యూరియా బాటిల్ అంతే పని చేస్తుందన్నారు. నానో ఎరువుల వల్ల కలిగే ఉపయోగాలను రైతులకు వివరించాలని కోరారు.

భూసేకరణ వేగవంతం

కలెక్టర్ ఎస్.రామ సుందర్ రెడ్డి

ప్రజాశక్తి-కంటోన్మెంట్

వివిధ ప్రాజెక్టులకు భూసేకరణను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి ఆదేశించారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టుల భూసేకరణపై కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. ముందుగా భోగాపురం విమానాశ్రయ భూసేకరణపై కలెక్టర్ సమీక్షిస్తూ, ఇప్పటివరకు జిఎంఆర్‌కు అప్పగించిన 2,200 ఎకరాల భూముల పరిస్థితి, వాటికి సంబంధించిన సమస్యలు తెలుసుకున్నారు. విమానయాన అనుబంధ పరిశ్రమల ఏర్పాటు కోసం ఇటీవలే కేటాయించిన 540 ఎకరాల భూమికి సంబంధించిన స్థితిగతులను ఆరా తీశారు. అలాగే ట్రంపెట్ బ్రిడ్జి నుంచి విమానాశ్రయానికి వెళ్లే రహదారి నిర్మాణం, భూమి లభ్యతపై సమీక్షించారు. విమానాశ్రయం భూములనుంచి వర్షపు నీరు వెలుపలికి వెళ్లే మార్గాలు, కాలువల నిర్మాణం, సబ్‌స్టేషన్ నిర్మాణం, ప్రత్యేక విద్యుత్ లైన్లు, తాగునీటి సరఫరా తదితర అంశాలపై ఆరా తీశారు. వీటి భూ సేకరణకు సంబంధించిన సమస్యలేమైనా ఉంటే తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు.

అనంతరం జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులకు భూసేకరణపై కలెక్టర్ సమీక్షించారు. జాతీయ రహదారులు 130 సిడి, 516బి కి ఇప్పటివరకు జరిగిన భూ సేకరణ, పెండింగ్ అంశాలను ఆరా తీశారు. వీలైనంత వేగంగా సేకరణ పూర్తిచేసి, భూములను అప్పగించాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్, డిఆర్ఒ ఎస్.శ్రీనివాసమూర్తి, ఆర్‌డిఒ డి.కీర్తి, వివిధ శాఖల ఇంజినీరింగ్ అధికారులు, భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రాజెక్టు హెడ్ రామరాజు, జాతీయ రహదారుల పీడీలు పాల్గొన్నారు.

సిటియులో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యార్థుల ఆరోగ్యం, మహిళల శ్రేయస్సు కోసం సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ ప్రాంగణంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఉచిత వైద్య పరీక్షలు, నిపుణుల సలహాలు, మందుల పంపిణీ చేపట్టారు. గొట్లాం షాలోం హాస్పిటల్ నుండి డాక్టర్ అనిల్ బెంజమన్ నాయకత్వంలో వైద్యులు సాధారణ ఆరోగ్య పరీక్షలు, కంటి పరీక్షలు,, రక్త పరీక్షలు చేశారు. సిటియు ఆర్థిక అధికారి పికె దాస్ మాట్లాడుతూ, విద్యార్థుల శ్రేయస్సు కోసం సులభంగా అందుబాటులో ఉండే ఆరోగ్య సేవలు అత్యవసరమని తెలిపారు. ఇన్చార్జి ఉపకులపతి ప్రొఫెసర్ టి. శ్రీనివాసన్ మాట్లాడుతూ, సిబ్బంది మరియు విద్యార్థుల సమగ్రాభివద్ధి కోసం ఇటువంటి శిబిరాలను నిరంతరంగా నిర్వహిస్తామని వెల్లడించారు.

ఎంవిజిఆర్‌కు పురస్కారాలు

ప్రజాశక్తి- డెంకాడ

ఎంవిజిఆర్ కళాశాల (అటానమస్), సైన్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగానికి చెందిన ఇద్దరు అధ్యాపకులు డాక్టర్ కెవి రత్న కుమార్, బి. హరి కుమార్, సాహిత్యానికి చేసిన విశేష కృషికి ప్రతిష్టాత్మక జాతీయ స్థాయి సాహిత్య అవార్డులు అందుకున్నారు. డాక్టర్ కెవి. రత్నకుమార్‌కు ఆంగ్ల సాహిత్యం-కవిత్వం రాష్ట్ర విభాగంలో రవీంద్ర రత్న పురస్కారం లభించగా, ఇగ్నైట్ ది విరాటియన్ ఇన్ యు పుస్తకానికి గాను ది లిటరేచర్ టైమ్స్ అందించే లెగసీ ఆఫ్ లిటరేచర్ అవార్డును బి.హరి కుమార్ సొంతం చేసుకున్నారు. వీరిని కళాశాల యాజమాన్యం అభినందించింది.

విశ్వకర్మ జయంతి స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి - చీపురుపల్లి

విశ్వకర్మ జయంతి మనందరికీ స్ఫూర్తిదాయకమని మాజీ ఎంపి బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. గురువారం చీపురుపల్లి హడ్కోకాలనీలో జరుగుతున్న విశ్వకర్మ జయంతి ఉత్సవాలలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడున్న అర్చకులు మాజీ ఎంపికి ఆశీర్వచనాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వకర్మ దైవిక శిల్పిగాను, సృష్టికర్తగాను, సకల విశ్వంలో దేవతల నగరాలు నిర్మించారని పూర్వీకులు చెబుతుంటారని అన్నారు. అటువంటి విశ్వకర్మ జయంతి వేడుకలలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వి దుర్గారావు, కొసిరెడ్డి రమణ, బూరాడ మహేష్, స్థానికలు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని చొల్లంగిపేట గ్రామంలో గురువారం పశు వైద్యాధికారుల ఆధ్వర్యంలో 300 పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బంటుపల్లి వాసుదేవరావు, టిడిపి నాయకులు కంది చంద్రశేఖర్‌రావు, పల్లి భాస్కర్‌రావు, సర్పంచ్ కోరాడ కనకరాజు, ఎంపిటిసి గుడివాడ కిరణ్ కుమార్, బగ్గా లక్ష్మణరావు, తొట్టడి సూర్యప్రకాష్, తొట్టడి సూరిబాబు, మహంతి చిన్నంనాయుడు, కలిసెట్టి రమణ, మహంతి నర్సింహనాయుడు, జగదీష్ రాజు, సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిర్మూలన అందరి బాధ్యత

ప్రజాశక్తి- రేగిడి

ప్లాస్టిక్ నిర్మూలన అందరి బాధ్యత అని ఎంపిడిఒ శ్యామలాకుమారి, ఇఒపిఆర్‌డి వి.జగన్నాధరావు అన్నారు. ఈ మేరకు గురువారం నాయిరాలవలసలో స్వచ్ఛతాహి సేవలో భాగంగా గృహ వ్యర్థాలు, తడి, పొడి చెత్త సేకరణ, ప్లాస్టిక్ నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటింటి చెత్త సేకరించిన వ్యర్థాలను చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలకు తరలించేలా స్వచ్ఛ దూతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల స్వచ్ఛభారత్ కోఆర్డినేటర్ సిహెచ్ పద్మ, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగికి జెసి అభినందన

ప్రజాశక్తి-కంటోన్మెంట్

కొత్తవలస మండలం గనిశెట్టిపాలెం సచివాలయంలో పనిచేస్తున్న డిజిటల్ సహాయకులు పొలిపి రెడ్డి శ్రీను గత నెల 28 నుండి 31వ తేదీ వరకు తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూర్ లో జరిగిన జాతీయ స్థాయి పోటీలలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. ఈ నేపథ్యంలో జాయింట్ కలెక్టర్‌ను శ్రీను కలవగా ఆయన అభినందించారు.



విద్యార్థి చరణ్‌తేజను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి - వంగర

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి సిహెచ్ చరణ్ తేజ ట్రైట్లాన్(ఎ) విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మీసాల కూర్మినాయుడు గురువారం తెలిపారు. ఈ నెల 14న శ్రీకాకుళంలోని కోడి రామ్మూర్తి స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ విభాగంలో సత్తా చాటినట్లు వెల్లడించారు. వాలీబాల్, కోకో జిల్లాస్థాయి పోటీలకు ఆ పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన చరణ్ తేజకు, జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు వ్యాయామ ఉపాధ్యాయుడు కె త్రినాధరావును ప్రధానోపాధ్యాయులు కూర్మినాయుడు, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

పట్టణాభివృద్ధికి ప్రాధాన్యత : మున్సిపల్ చైర్మన్

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్ బాబు అన్నారు. పట్టణంలోని 5,8వార్డులలో 15 ఆర్థిక సంఘం నిధులతో గురువారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో మౌలిక సౌకర్యాలు కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. సిరుగుడువీధిలో రూ 5లక్షలతో సీసీ కాలువ, రత్నాల నగర్'లో రూ.6 లక్షలతో సీసీ కాలువ, కల్వర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కమిషనర్ ఎల్.రామలక్ష్మి, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని కొండవెలగాడ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్తు అంతరాయం కలుగుతుందని టౌన్ డిఇఇ పి.త్రినాధరావు ఒక ప్రకటనలో తెలిపారు. కొండవెలగాడ సబ్ స్టేషన్ పరిధి నెల్లిమర్ల సెక్షన్‌లో నిర్వహణ పనుల నిమిత్తం ఉదయం 9 గంటల నుండి 2 గంటల వరకు కొండవెలగాడ, అపెక్స్ కాలేజ్, బిఎస్‌ఎన్‌ఎల్ టవర్ ప్రాంతంలో విద్యుత్ అంతరాయం కలుగుతోందన్నారు.

కొనసాగుతున్న నిరసన

ప్రజాశక్తి-శృంగవరపుకోట

తమ భూములను తిరిగి ఇవ్వాలని కోరుతూ జిందాల్ నిర్వాసితులు బొడ్డవరలో చేపడుతున్న నిరసన గురువారం కొనసాగింది. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు చల్లా జగన్ మాట్లాడుతూ పేదల నుంచి సేకరించిన భూములను తిరిగి నిర్వాసితులకు ఇవ్వాలని, జిఒ 14ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

నేడు ఆతవలో యూరియా పంపిణీ

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని ఆతవ రైతు సేవా కేంద్రం వద్ద శుక్రవారం యూరియా పంపిణీ చేయనున్నట్లు ఎఒ ఎం.స్వాతి తెలిపారు. సింగరాయి సచివాలయ పరిధిలోని జగ్గయ్యపేట, అరిగిపాలెం, సింగరాయి గ్రామాల్లో భూములున్న రైతులు తమ వన్‌బి, ఆధార్ కార్డు తీసుకురావాలని సూచించారు

మున్సిపల్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపల్ కార్మికులకు పిఆర్‌సి ప్రకారం జీతాలు చెల్లించాలని బొబ్బిలి వేణుగోపాల్ స్వామి సెంటర్లో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.శంకరరావు మాట్లాడుతూ గత జులైలో జరిగిన సమ్మె కాలానికి జీతం చెల్లిస్తామని ప్రకటించినా, ఇంతవరకు చెల్లించలేదన్నారు. సమ్మె సందర్భంగా ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. వీటిపై ఈ నెల 23న చలో విజయవాడ కార్యక్రమం చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జి.గౌరేష్, జె.రామారావు, బి.యుగంధర్, జి.శంకర్రావు, జి.వాసు, ఎం.ప్రసాద్ పాల్గొన్నారు.



వేణుగోపాలస్వామి సెంటర్‌లో నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు, సిఐటియు నాయకులు

మున్సిపల్ కార్మికుల సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలి

నెల్లిమర్ల :మున్సిపల్ కార్మికుల సమస్యలను అసెంబ్లీలో చర్చించాలని మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ. జగన్ మోహన్ రావు డిమాండ్ చేశారు. గురువారం మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక మొయిద జంక్షన్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం ప్రారంభమైన అసెంబ్లీ సమావేశాల్లో మున్సిపల్ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలపై చర్చించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా గత ప్రభుత్వ సమయంలో 17 రోజులు సమ్మె జరిగిందని, ఈ సందర్భంగా జరిగిన రాతపూర్వక ఒప్పందాలకు నేటికీ కూటమి ప్రభుత్వం జీవోలు ఇవ్వలేదని ఆందోళన వ్యక్తం చేశారు. సంవత్సరాలు గడుస్తున్నా మరణించిన, రిటైర్ అయిన వారి బిడ్డలకు ఉద్యోగాలు ఇవ్వకుండా పాలకవర్గాలు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని అన్నారు. 12వ పిఆర్‌సి తక్షణమే ప్రకటించాలని, మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేస్తూ అసెంబ్లీలో నిర్ణయం చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీల్లో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న థర్డ్ పార్టీ కార్మికులందరికీ ఆప్కాస్ జీతాలు చెల్లించాలని లేనిపక్షంలో సెప్టెంబర్ 23న విజయవాడలో ధర్నా చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కిల్లంపల్లి రామారావు, మున్సిపల్ యూనియన్ నాయకులు బాబురావు, హరిబాబు, రాము తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం : కలెక్టర్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా సమన్వయంతో ముందుకు సాగితే ప్రజలు సంతృప్తి చెందుతారని జిల్లా కలెక్టర్ ఎస్. రామసుందర్ రెడ్డి తెలిపారు. అమరావతిలో జరిగిన కలెక్టర్ల సమావేశం అనంతరం విజయనగరం చేరుకున్న జిల్లా కలెక్టర్ గురువారం జిల్లా అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారి సూచనలను వివరంగా అధికారులకు తెలియజేస్తూ, వాటిని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా చేరేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. రైతు సంక్షేమం కోసం ఎరువులు, విత్తనాల సరఫరా, కాలువల ద్వారా సాగునీటి సరఫరా అంశాలను సమయానికి సమన్వయం చేసుకోవాలని వ్యవసాయ, నీటి పారుదల శాఖల అధికారులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మానవ వనరుల అభివృద్ధి, విద్యా ప్రమాణాల పెంపు కోసం జాగ్రత్తలు తీసుకోవాలని, తల్లికి వందనం, స్కాలర్‌షిప్‌లు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామీణ స్థాయిలో ఆరోగ్య సేవలు అందుబాటులో ఉండేలా ఆరోగ్య సిబ్బంది, వైద్యులు, ఔషధాల లభ్యతపై పర్యవేక్షణ చేయాలని, కలెక్టర్ ఆదేశించారు. ప్రతి శాఖ అధికారి తమ పరిధిలో గ్రీవెన్స్ సక్రమంగా పరిష్కరించాలని సూచించారు. మౌలిక వసతుల అభివృద్ధి, రహదారులు, తాగునీటి సౌకర్యాలు, పట్టణ మరియు గ్రామీణ అభివృద్ధి ప్రాజెక్టులు సమయానికి పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో సంయుక్త కలెక్టర్ ఎస్ సేథు మాధవన్, డిఆర్‌ఒ శ్రీనివాస్ మూర్తి, ఆర్‌డిఒ డి. కీర్తి, సిపిఒ పి.బాలాజీ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నేడు వైసిపి చలో మెడికల్ కాలేజీ

జయప్రదం చేయాలని నాయకుల పిలుపు

ప్రజాశకి-విజయనగరం టౌన్

ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చలో మెడికల్ కాలేజ్ నిరసన కార్యక్రమం శుక్రవారం 10 గంటలకు నూతనంగా నిర్మించిన మెడికల్ కాలేజ్ వద్ద నిర్వహించనున్నట్లు మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి తెలిపారు. గురువారం తన నివాసంలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పేద విద్యార్థులకు మెరుగైన విద్య, పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందుబాటులో ఉండాలనే ఆలోచనతో మెడికల్ కాలేజి ఏర్పాటు చేశారని తెలిపారు. కానీ ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు ఆయన సొంత మీడియా ద్వారా ప్రజలకు ప్రలోభపెట్టే ప్రయత్నాలు మానుకోవాలని హితవు పలికారు. ప్రజలు వాస్తవాలను గ్రహించాలని, సోషల్ మీడియా ద్వారా వైసిపి యువజన విద్యార్థి విభాగాలు వాస్తవాలు ప్రజలకు నేరుగా చేరేలా ప్రయత్నం చేయాలని తెలిపారు. ఈనేపథ్యంలో ప్రజలకు వాస్తవాలు తెలిపేందుకు చలో వైద్య కళాశాల కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం గోడపత్రికలను ఆవిష్కరించారు సమావేశంలో వైసిపి జిల్లా యువజన విభాగం ఇన్చార్జి ఈశ్వర్ కౌశిక్, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షులు కరుమజ్జి సాయి, పట్టణ యువజన విభాగం ఇన్చార్జ్ బాడసింగి ఈశ్వరరావు, యువజన, విద్యార్థి విభాగం నాయకులు పాల్గొన్నారు.

చీపురుపల్లి :ఈ నెల 19న తలపెట్టిన ఛలో మెడికల్ కాలేజ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నియోజకవర్గ వైసిపి యువజన విభాగం అధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ యువతకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా స్థానిక పంచాయితీ కార్యాలయం ఆవరణలో మాజీ ఎంపి బెల్లాన చంద్రశేఖర్, వైయస్ఆర్‌సిపి జిల్లా కార్యదర్శి ఇప్పిలి అనంతం, ఆ పార్టీ ప్రచారవిభాగం జిల్లా అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడుతో కలసి గోడ పత్రికలను విడుదల చేశారు. రాజాం నియోజకవర్గ ఇంచార్జ్ డాక్టర్ తలే రాజేష్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ఆధ్వర్యంలో చలో మెడికల్ కళాశాలల కార్యక్రమాన్ని చేపడతామన్నారు. ఈ కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపి బెల్లాన, వైసిపి నాయకులు

నెల్లిమర్ల: ప్రభుత్వ వైద్య కళాశాలను ప్రయివేట్ పరం చేయడం దారుణమని జైభీంరావు భారత్ పార్టీ నాయకులు టొంపల నరసయ్య, కనిగిరి శ్రీనివాసరావు, చిన్నం అరుణ్ కుమార్ అన్నారు. గురువారం వారు నెల్లిమర్లలో విలేకర్లతో మాట్లాడుతూ ప్రజాధనంతో నిర్మించిన ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రయివేటు పరం చేయడం అన్యాయమన్నారు.

విద్యార్థులకు టిడిపి, వైసిపి నాయకుల పరామర్శ

ప్రజాశక్తి-విజయనగరంకోట/టౌన్

నగరంలోని బిసి కాలనీలోగల బిసి విద్యార్థుల వసతి గృహం విద్యార్థులు అస్వస్థతకు గురైన నేపథ్యంలో టిడిపి, వైసిపి నాయకులు గురువారం ఆ హాస్టల్‌ను సందర్శించారు. రెండు రోజుల క్రితం బిసి హాస్టల్ లో రాత్రి భోజనం తిన్న తరువాత 28 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. వారంతా స్థానిక పిహెచ్‌సిలో వైద్యం పొంది కోలుకున్నారు. ఈ నేపథ్యంలో టిడిపి నాయకులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, గంటా రవి, కంది మురళీనాయుడు, అనురాధ భేగం తదితరులు విద్యార్థులను పరామర్శించారు. విద్యార్థుల ఆరోగ్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. వైసిపి మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మున్సిపల్ డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి వసతి గృహాన్ని సందర్శించారు. విద్యార్థుల ఆరోగ్యంపై అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ చుట్టూఉన్న పరిసరాలను, వంటశాలను పర్యవేక్షించి వసతి తీరును విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ హాస్టల్‌లో అంతంత మాత్రంగానే సౌకర్యాలు ఉన్నాయని తెలిపారు. విద్యార్థులకు మెరుగైన వసతులను కల్పించాలని బిసి వెల్ఫేర్ అధికారులను కోరారు. రాజకీయాలకు అతీతంగా హాస్టల్ విద్యార్థినులకు ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా అందిస్తామని తెలిపారు. ఆమె వెంట వైసిపి స్థానిక కార్పొరేటర్ చందక శ్రీను, బాలి కృష్ణారావు తదితరులు ఉన్నారు.



విద్యార్థులను పరామర్శిస్తున్న టిడిపి నాయకులు

సిహెచ్‌సిలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. స్వస్త నారీ స్వశక్తి అభియాన్‌లో భాగంగా ఆసుపత్రి వైద్యాధికారి ఎం. తిరుమల దేవి ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 18 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో పలువురు వైద్య సిబ్బంది, మహారాజా బ్లడ్‌బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

చీపురుపల్లి: కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన స్వస్తి నారీ స్వశక్తి పరివార్ అభియాన్ మహిళల ఆరోగ్య పరిరక్షణకు ఉపయోగ పడుతుందని జెడ్‌పిటిసి వలిరెడ్డి శిరీషా అన్నారు. స్థానిక ఆర్య సమాజం కార్యాలయం ఆవరణలో గురువారం ఐసిడిఎస్, కర్లాం పిహెచ్‌సిలు సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఆరోగ్యశిబిరంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ, చీపురుపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని సోమరాజుపేటలో స్వస్త నారీ స్వశక్తి పరివార్ అభియాన్‌లో భాగంగా వైద్యాధికారి డాక్టర్ వావిలపల్లి రీనా చౌదరి గురువారం 90 మంది మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ సవలాపురపు ముద్దులమ్మ, హెల్త్ ఇఒ రాధాకృష్ణ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

గంట్యాడ :మహిళల పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యవంతులుగా ఉంటారని ఎంపిపి పీరుబండి హైమావతి అన్నారు. రామవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, గొటియాడ అంగన్వాడీ కేంద్రంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ, వైద్య శాఖ ఆధ్వర్యంలో గురువారం స్వస్తి నారి సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ఐసిడిఎస్ పిఒ ఉమాభారతి, వైసిపి ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు పి.జైహింద్ కుమార్, టిడిపి నాయకులు అల్లు విజయ కుమార్, సెక్టార్ సూపర్వైజర్ అనురాధ, కార్యకర్తలు వెంకటలక్ష్మి, ఉమ పాల్గొన్నారు.

వైసిపి బూత్ కమిటీలు ఏర్పాటు

ప్రజాశక్తి - చీపురుపల్లి

మండలంలోని పలు గ్రామాలలో వైసిపి నాయకులు గురువారం పర్యటించి బూత్ స్థాయి కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా పార్టీ కార్యదర్శి ఇప్పిలి అనంతం, జిల్లా పార్టీ ప్రచార అధ్యక్షులు వలిరెడ్డి శ్రీనివాస నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు మీసాల వరహాల నాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అక్రమంగా బనాయిస్తున్న కేసులపై వైసిపి కార్యకర్తలు భయపడొద్దని భరోసా కల్పించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పనస అప్పారావు, రఘుమండ త్రినాధ, రేవల్ల సత్తిబాబు, చందక గురునాయుడు, మీసాల ఈశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కళ్లద్దాలు పంపిణీ

ప్రజాశక్తి - గరివిడి

విశాఖకు చెందిన మొహసిన్ స్కూల్ హెల్త్ ఐ కేర్ ప్రాజెక్ట్-2025 సంస్థ గత నెల 21న కొండపాలెం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో 208 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ మేరకు ఐదుగురు విద్యార్థులకు కళ్లద్దాలు అవసరమని గుర్తించి గురువారం పాఠశాల హెచ్‌ఎం డి. రాము ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆ సంస్థ ప్రతినిధులు హెచ్ చంద్రశేఖరరావు, ఉపాధ్యాయులు ఏవిఏఎస్‌ఎన్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి : కమిషనర్

ఈజాశక్తి-విజయనగరం టౌన్

ప్రతి ఒక్కరూ తమ వ్యక్తిగత పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా గురువారం పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సర్కిళ్ల వారీగా ఆయా పరిధిలో ఉన్న పట్టణ ఆరోగ్య కేంద్రాలలో ఈ మేరకు పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అలాగే వ్యక్తిగత పరిశుభ్రతపై వైద్యులు పారిశుధ్య సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రజారోగ్య సిబ్బంది, పారిశుధ్య పర్యవేక్షకులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను పరిధిలోకి తీసుకు రావాలి

ప్రతి ఆస్తి, పన్ను పరిధిలోకి తీసుకురావాలన్న ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం నగర వ్యాప్తంగా ఇంటింటి సర్వే చేపట్టారు. సచివాలయ అడ్మిన్, ఎమినిటీస్, ప్లానింగ్, ఉమెన్ ప్రొటెక్షన్, వెల్ఫేర్ కార్యదర్శులతో పాటు కార్యాలయ సిబ్బంది ఒకరు మొత్తంగా ఒక టీముగా ఏర్పడి సర్వేలో పాల్గొంటున్నారు. అక్టోబర్ 10వ తేదీ లోపుగా సర్వే పూర్తి చేసి నివేదికలు సమర్పించనున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ స్థలాన్ని లీజుకు ఇస్తామంటే అంగీకరించం : సిపిఎం

ప్రజాశక్తి-బొబ్బిలి

ప్రభుత్వ స్థలాన్ని రిసార్టు కోసం లీజుకు ఇస్తామంటే అంగీకరించబోమని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.శంకర్రావు, మండల కార్యదర్శి సింగిరెడ్డి గోపాలం తెలిపారు. 2010లో హస్తకళల కోసం బొబ్బిలి ఐటిఐ పక్కన పర్యాటక శాఖకు కేటాయించిన సుమారు రెండు ఎకరాల స్థలాన్ని గురువారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో పర్యాటక శాఖకు కేటాయించిన రెండు ఎకరాల స్థలాన్ని బిజెపి నాయకులకు 50 ఏళ్ల లీజుకు రిసార్ట్ వ్యాపారం నిమిత్తం కేటాయించినట్లు తెలిసిందని, ఆ లీజును తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాల విభజన అనంతరం బొబ్బిలి డివిజన్ కేంద్రంగా మారిందని, ఇక్కడ అనేక ప్రభుత్వ, ప్రజల అవసరాలకు ఈ స్థలం వినియోగించాల్సి ఉందని చెప్పారు బొబ్బిలి పట్టణంలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు లేవని, ఇఎస్‌ఐ హాస్పిటల్ లేదని చెప్పారు. బిసి వసతిగృహాన్ని కోమటిపల్లిలో అద్దె భవనంలో నిర్వహిస్తున్నారని తెలిపారు. ఆర్‌డిఒ కార్యాలయం. ఎపిఐఐసి భవనంలో కొనసాగుతోందన్నారు. వీటి గురించి ఆలోచించకుండా టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండడంతో బిజెపి నాయకులకు భవనాలను, స్థలాన్ని లీజుకు ఇవ్వడం అన్యాయమన్నారు. లీజు ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలతో కలిపి ఆందోళన చేస్తామని హెచ్చరించారు.



కలెక్టర్ రామసుందర్‌రెడ్డిని సన్మానిస్తున్న కర్రోతు సత్యనారాయణ తదితరులు

కలెక్టర్‌ను కలసిన కర్రోతు

ప్రజాశక్తి - భోగాపురం

నూతనంగా నియమితులైన జిల్లా కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డిని భోగాపురం మండల టిడిపి అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో ఆయన్ను శాలువతో సన్మానించారు. ఆయనతో పాటు కలెక్టర్‌ను కలిసిన వారిలో క్లస్టర్ ఇంచార్జి పిడుగు తోటరావు, పార్లమెంట్ రెడ్డిక సాధికార సమితి కన్వీనర్ నీలాపు అప్పలరామిరెడ్డి, పార్లమెంట్ తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి కర్రోతు రాజు, ఎస్‌సి సెల్ కార్యదర్శి ఓదురి నరసింహులు, నారా లోకేష్ యువజన ఫౌండేషన్ అధ్యక్షుడు రౌతు రామకృష్ణ, కోలా రామసూరి, రీసు రమణ, పతివాడ పెద్ద శంకర్, యూనిట్ ఇంచార్జ్ బాలు, మండల పృధ్వీరాజ్ తదితరులు ఉన్నారు.

నేడు మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-డెంకాడ

నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు జన్మదిన వేడుకలు శుక్రవారం చింతలవలసలోని వెంకటేశ్వర ఆలయంలో ఘనంగా నిర్వహించనున్నట్లు వైసిపి మండల అధ్యక్షులు పిన్నింటి తమ్మునాయుడు తెలిపారు. బడ్డుకొండ పేరుపై ప్రత్యేక పూజలు చేసిన అనంతరం అయినాడ జంక్షన్ వద్ద భారీ కేక్ కట్ చేయనున్నట్లు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు హాజరైన విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఆయిల్‌పామ్ సాగు పెంచాలి

ప్రజాశక్తి-గంట్యాడ

రైతులు ఆయిల్‌పామ్ సాగు పెంచాలని ఉద్యాన శాఖ అధికారి స్వాతి అన్నారు. గురువారం మండలంలోని చంద్రంపేట గ్రామంలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎకరం పైబడి ఉన్న ప్రతి రైతు ఆయిల్‌పామ్ పంటను వేసుకోవడానికి శ్రీశ్రీనివాస పామాయిల్ మిల్ అవకాశాన్ని కల్పిస్తుందన్నారు. ఎకరానికి రూ.2100 చొప్పున నాలుగేళ్ల వరకు సబ్సిడీ ఇస్తుందని చెప్పారు. అందులో అంతర పంటలను పండించుకోవడానికి ప్రభుత్వం ఎకరానికి రూ.2100 చొప్పున సబ్సిడీ అందజేస్తుందని తెలిపారు. చంద్రంపేటలో 70 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగుచేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కంపెనీ ఫీల్డ్ ఆఫీసర్ వర్రి ఎర్రినాయుడు పాల్గొన్నారు.

బాడంగి : మండలంలోని పాల్తేరు గ్రామంలో ఆయిల్‌పామ్ పంటపై రైతులకు ఉద్యాన శాఖ, లక్ష్మీ బాలాజీ ఆయిల్‌పామ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యాన శాఖ అధికారి మోహన్‌కృష్ణ మాట్లాడుతూ ఆయిల్ పామ్ మొక్కలు ఉచితంగా అందిస్తామన్నారు. ప్రస్తుతం టన్ను గెల ధర ప్రకారం ఎకరాకి ఖర్చులు పోగా రూ.లక్ష నుంచి రూ.1.30 లక్షల వరకు ఆదాయం లభిస్తుందన్నారు.

పైలెట్ ప్రాజెక్టుగా చంద్రంపేట ఎంపిక

ప్రజాశక్తి-గంట్యాడ

మ్యాజి కల్ డ్రెయిన్ పైలెట్ ప్రాజెక్టుగా చంద్రంపేట గ్రామం ఎంపికైందని ఉపాధి హామీ ఎపిడి పద్మ అన్నారు. చంద్రంపేట గ్రామాన్ని గురు వారం ఎపిడి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిసి రోడ్లు ఉన్న ప్రాంతంలో కాలువల నిర్మాణం కోసం ఉపాధి హామీ ద్వారా ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. ఈ పనులు విజయవంతంగా పూర్తయితే, జిల్లా వ్యాప్తంగా అన్ని పంచాయతీల్లోనూ ప్రభుత్వం చేపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఎపిఒ సుందర్రావు, జెఇ రమణ, టెక్నికల్ అసిస్టెంట్ జి.వేణు, పంచాయతీ కార్యదర్శి అనురాధ పాల్గొన్నారు.



గ్రామంలో పర్యటిస్తున్న డ్వామా ఎపిడి పద్మ

ఎంఆర్ అగ్రహారంలో దారుణం

తండ్రిని హత్య చేసిన కొడుకు

ప్రజాశక్తి-తెర్లాం

మండలంలోని ఎంఆర్ అగ్రహారం గ్రామంలో దారుణం చోటుచేసుకుంది. మద్యం మత్తులో కన్నకొడుకే రాయితో తండ్రిని కొట్టి హత్య చేశాడు. బుధవారం రాత్రి ఈ సంఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... ఎంఆర్ అగ్రహారం గ్రామానికి చెందిన నగరపు అప్పలస్వామి(85)కు ఇద్దరు కుమారులున్నారు. చిన్నకుమారుడు నగరపు శంకరరావు తాగిన మైకంలో రాయితో బలంగా తండ్రి అప్పలస్వామి తలపై కొట్టాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో మనుమరాలు కల్పన.. వెంటనే తెర్లాంలోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించింది. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి అప్పలస్వామి మరణించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాడంగి సామాజిక ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని క్లూస్‌టీంతో పాటు సిఐ కె.నారాయణరావు, ఎస్ఐ సాగర్‌బాబు పరిశీలించారు. కల్పన ఫిర్యాదుపై బొబ్బిలి రూరల్ సిఐ కె.నారాయణరావు కేసునమోదు చేశారు.



హత్యకు గురైన అప్పలస్వామి (ఫైల్)

ఆర్మీ ఉద్యోగిపై కేసు నమోదు

ప్రజాశక్తి-సంతకవిటి

స్థానిక పోలీసు స్టేషన్‌లో గురువారం ఆర్మీ ఉద్యోగిపై కేసు నమోదైంది. ఎస్ఐ గోపాలరావు తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీకంగా అనుభవించి, తరువాత ముఖం చాటేశాడని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.